క్లుప్తంగా

తాడ్వాయిలో భారీ వర్షం



తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి మండలంలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. మక్కలు, వడ్లు తడిసిముద్దయ్యాయి. చేతికి వచ్చిన వరి నేలకు ఒరిగిందని, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాడ్వాయి మండల కేంద్రంతోపాటు దేమికలాన్, కన్‌కల్, కాలోజివాడి, బ్రాహ్మణపల్లి, ఎర్రాపహాడ్, కరడ్‌పల్లి తదితర గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబోసిన ధాన్యం, మక్కలు తడిశాయి. అధికారులు స్పందించి మరిన్ని కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి తడిసిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని కోరుతున్నారు. బిర్నీస్(రాజ్మా), పత్తి, శనగ పంటలకు కొంత మేరకు మేలు జరిగిందని రైతులు తెలిపారు.

మోడల్ పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి పట్టణంలో మోడల్ పోలింగ్ కేంద్రం, మహిళా పోలింగ్ కేంద్రాలను ఎన్నికల అధికారులు ఏర్పాటు చేశారు. గురువారం నిర్వహించనున్న సాధారణ ఎన్నికలకు సంబంధించి మున్సిపాలిటీలో మోడల్ పోలింగ్‌స్టేషన్, జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో మహిళా పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అధికారులు కోరారు.

కొనసాగుతున్న క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతోంది. మంగళవారం నాటికి 27వేల 558 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ చైర్మన్ వేణుగోపాల్ రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నామన్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలపై కేసు నమోదు

ఖలీల్‌వాడి: నగరంలోని 6వ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు ఇరువురు దాడికి పాల్పడ్డారు. దీంతో ఇరువురు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సౌత్ సీఐ వెంకట్‌నారాయణ బుధవారం తెలిపారు. దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

బీఆర్ఎస్‌లో చేరిక

మోపాల్: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రోడ్ బుచ్చన్న బుధవారం బీఆర్ఎస్‌లో చేరారు. సర్పంచ్ క్యాతం రవి, ఎంపీటీసీ ముత్తెన్న ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడోసారి బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. నాయకులు రాజశేఖర్‌రెడ్డి, పాప, సాయిలు, గణపతి పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవాలి

మోపాల్: నగరశివారులోని బోర్గాం(పి) 5వ డివిజన్‌లో జై భీమ్‌నగర్ కాలనీలో మంగళవారం రాత్రి కురిసిన వడగళ్ల వాన, ఈదురుగాలులక పలువురి ఇళ్లు పూర్తి నేలమట్టమయ్యాయి. దీంతో కాలనీవాసులందరికీ పక్కా ఇళ్లు నిర్మించి, ఆదుకోవాలని కాలనీ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు కోరారు. ఈమేరకు బుధవారం కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ కాలనీలో రెవెన్యూ అధికారులు సందర్శించి పరిహారం ఇప్పించాలని కోరారు. ఒక్కో కుటుంబానికి రూ.2 లక్షల ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

నిజామాబాద్‌నాగారం: నగరంలో మంగళవారం కురిసిన వడగళ్ల వానతో పలువురి ఇళ్లు దెబ్బతిన్నాయి. దీంతో బుధవారం బుధవారం అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా పలు ప్రాంతాల్లో పర్యటించి, బాధితులను పరామర్శించారు. బీఆర్ఎస్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, దండు శేఖర్, సూదం రవి చందర్, సత్య ప్రకాష్, ఆకుల శ్రీశైలం పాల్గొన్నారు.

సర్వం సిద్ధం

- పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి
- కేంద్రాలకు తరలిన సిబ్బంది
- బందోబస్తు విధుల్లో పోలీసులు బిజీబిజీ
- పలుచోట్ల మోడల్, మహిళా పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాల్లో పోలింగ్‌కు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది ఆయా నియోజకవర్గాల డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుంచి బుధవారం పోలింగ్ సామగ్రి తీసుకొని తమకు కేటాయించిన కేంద్రాలకు చేరుకున్నారు. సిబ్బంది స్థానిక బీఎల్‌వోలతో కలిసి ఏర్పాట్లను సరి చూసుకున్నారు.





మద్నూర్‌లో డిస్ట్రిబ్యూషన్ సెంటర్

ఎల్లారెడ్డి పోలింగ్ కేంద్రాలు 270



ఈవీఎంలతో పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్తున్న ఎన్నికల సిబ్బంది

ఎల్లారెడ్డి/ఎల్లారెడ్డి రూరల్/లింగంపేట/నాగిరెడ్డిపేట: ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల ఏర్పాట్లు పూర్తయినట్లు రిటర్నింగ్ అధికారి మన్నె ప్రభాకర్ తెలిపారు. నియోజకవర్గం పరిధిలో 270 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, 1600 మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తారన్నారు. 270 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 29 రూట్లుగా విభజించడం జరిగిందన్నారు. పట్టణంలోని జీవదాన్ పాఠశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి సిబ్బంది ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు వెళ్లారు. 270 మంది పీవోలు, 270 మంది ఏపీవోలు, 540 మంది ఓపీవోలు, 48 మంది మైక్రో అబ్జర్వర్లు, నలుగురు అబ్జర్వర్లు,169 మంది వెబ్‌కాస్టింగ్ సిబ్బంది విధులు నిర్వర్తించనున్నారు. 650 మంది పోలీసులు ఎన్నికల విధులు నిర్వర్తించనున్నట్లు ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. ఏడుగురు సీఐలు, 14మంది ఎస్సైలు, 20 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 270 మంది పీసీలు, 59 మంది ఆర్మీ సిబ్బంది, 96 ఎస్ఎస్‌బీ, 70 మంది సివిల్ సిబ్బంది విధులు నిర్వహిస్తారని డీఎస్పీ వివరించారు. లింగంపేట మండలంలోని 41 గ్రామపంచాయతీల పరిధిలో 42 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తహసీల్దార్ ప్రభాకర్ తెలిపారు. నాగిరెడ్డిపేట మండలంలోని పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది బుధవా రం సాయంత్రం చేరుకున్నారు. పోలింగ్ సిబ్బందికి అవసరమైన ఏర్పాట్లను బీఎల్‌వోలు చేయించారు.



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు



ఎల్లారెడ్డి మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రం



ఎల్లారెడ్డి జెడ్పీ బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన మహిళా పోలింగ్ కేంద్రం

బాన్సువాడ పోలింగ్ కేంద్రాలు 258

బాన్సువాడ : బాన్సువాడ నియోజకవర్గంలోని 258 పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేశామని రిటర్నింగ్ అధికారి భుజంగరావు తెలిపారు. బాన్సువాడ ఎస్ఆర్ఎన్‌కే డిగ్రీ కళాశాల నుంచి ఎన్నికల సామగ్రిని తీసుకుని సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. నియోజకవర్గంలోని బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్, వర్ని, చందూర్, మోస్రా, రుద్రూర్, కోటగిరి, పొతంగల్ మండలాల్లో 258 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.

ఆయా కేంద్రాల్లో 1032 మంది సిబ్బందితోపాటు అదనంగా మరో 208 మందిని నియమించారు. 21 రూట్లను ఏర్పాటు చేసి 28 ప్రాంతాల్లో మైక్రో అబ్జర్వర్లను నియమించడంతోపాటు 12 మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని రిటర్నింగ్ అధికారి తెలిపారు. నియోజకవర్గంలో 93,388 మంది పురుష ఓటర్లు, 1,01,795 మంది మహిళా ఓటర్లు, ఇతరులు 8 మంది మొత్తం 1,95,191 మంది ఓటర్లు ఉన్నారు.



బీర్కూర్‌కు పోలింగ్ సామగ్రితో వచ్చిన సిబ్బంది



పోలింగ్ కేంద్రాలకు వెళ్లే వారి సంతకాలు సేకరిస్తున్న అధికారులు

జుక్కల్ పోలింగ్ కేంద్రాలు 255



బూర్గుల్‌లో పోలింగ్ కేంద్రం ఎదుట రంగవల్లులు



బెలూన్లతో అలంకరించిన మోడల్‌పోలింగ్ కేంద్రం

మద్నూర్(జుక్కల్): జుక్కల్ నియోజికవర్గం పరిధిలోని ఎనిమిది మండలాల్లో 255 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి మను చౌదరి తెలిపారు. మొత్తం 1304 మంది ఎన్నికల సిబ్బందితోపాటు 510 మంది పోలీసులు విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. 55 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించామని, ఆయా పోలింగ్ కేంద్రాల్లో పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సిబ్బంది ఉదయం 6.30 గంటలకు పోలింగ్ కేంద్రాలకు చేరుకొని మొదట ఈవీఎంల ద్వారా మాక్‌పోల్ నిర్వహించిన అనంతరం పోలింగ్‌ను ప్రారంభించాలని సూచించారు. ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని, ఎలాంటి తప్పులు దొర్లకుండా, అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా చూడాలని ఆదేశించారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ముజీబ్, పోలింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



డ్యూటీలు వేస్తున్న రిటర్నింగ్ అధికారి మనుచౌదరి



ఈవీఎంలను తీసుకుంటున్న సిబ్బంది



చంటి పిల్లలను చూసుకుంటున్న ఉద్యోగుల బంధువులు



కామారెడ్డిలో పోలింగ్ సామగ్రి తీసుకుంటున్న సిబ్బంది

రాజకీయ లబ్ధి పొందేందుకు బీజేపీ కుట్ర

బాన్సువాడ : రాజకీయ లబ్ధిపొందేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని బీఆర్ఎస్ నాయకుడు దుద్దాల అంజిరెడ్డి ఆరోపించారు. బాన్సువాడలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బాన్సువాడలో స్థానికేతరులు ఉన్నారని, ఓ చోట బీజేపీ నాయకులు డబ్బులు పంచుతున్నారని, సమాచారం రావడంతో పోచారం భాస్కర్‌రెడ్డి అక్కడి వెళ్లారని ఆయన తెలిపారు. భాస్కర్ రెడ్డి అక్కడికి వెళ్లినందుకు బీజేపీ అభ్యర్థి డ్రైవర్‌ను కొట్టారని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం శోచనీయమన్నారు. బీజేపీ నాయకుడి ఇంట్లో డబ్బులు ఎవరెవరికి ఇచ్చారో కాగితాలు కూడా దొరికాయని, ఆ కాగితాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపిస్తామని, అప్పుడు బీజేపీ బండారం బయటపడుతుందని అన్నారు. భాస్కర్‌రెడ్డిపై లేనిపోని ఆరోపణలు చేసి ఎన్నికల్లో రాజకీయంగా లబ్ధిపొందాలని బీజేపీ చూస్తోందని విమర్శించారు. బాన్సువాడలో బీజేపీకి డిపాజిట్ కూడా రాదన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గురువినయ్, కృష్ణారెడ్డి, ఎజాస్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి

మద్నూర్(జుక్కల్): ఎన్నికల నిర్వహణలో ఎలాంటి తప్పులు దొర్లకుండా, బాధ్యతాయుతంగా పని చేయాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ సూచించారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎంల పంపిణీ కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ పరిశీలించారు. ఎన్నికల విధులకు సిబ్బంది అందరు హాజరయ్యేలా చూడాలన్నారు. రిటర్నింగ్ అధికారి మనుచౌదరితో మాట్లాడి పలు సూచనలు చేశారు.



ఓటరు జాబితాలో పేర్లు గల్లంతు

బిచ్కుంద్(జుక్కల్) : జాబితాలో తమ పేర్లు గల్లంతుకావడంతో పలువురు ఓటర్లు ఆందోళన చెందుతున్నారు. తాము ఓటు హక్కును కోల్పోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బిచ్కుంద మండలంలో చాలా మంది పేర్లు జాబితాలో కనబడడంలేదు. బీఎల్‌వోల వద్ద ఉన్న స్థానికంగా ఉంటున్నప్పటికీ తమ పేర్లను జాబితా నుంచి తొలగించడం బాధకరమని వారు పేర్కొంటున్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కు తమకు లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఒకే ఇంటికి చెందిన ఓటర్ల పేర్లు వేర్వేరు బూత్‌లలో నమోదుకావడంతో ఇబ్బందులు పడుతున్నారు. చిరునామా తెలియక బూత్‌లెవల్ అధికారులు ఓటరు స్లిప్పులు పంపిణీ చేయలేదు. 20 శాతం మందికి స్లిప్పులు అందలేదని సమాచారం. ఓటరు స్లిప్పులు అందని వారు పోలింగ్ బూత్ వద్ద తీసుకోవచ్చని, ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అధికారులు కోరుతున్నారు.



బీఎల్‌వోల వద్ద ఉన్న లిస్టులో పేర్లు చూసుకుంటున్న ఓటర్లు

రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక

నిజామాబాద్‌నాగారం: నగరంలోని ప్రభుత్వ స్విమ్మింగ్ పూల్ ఆవరణలో బుధవారం జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయికి జిల్లాస్థాయి జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. బాలబాలికల విభాగంలో పోటీలు నిర్వహించి, ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. బాలుర విభాగంలో తేజస్, అక్షయ్‌దీప్, రుకేష్‌గౌడ్, సరూష్, సాయిఅఖిల్‌చారీ, మోహన్‌దుర్గా ఎంపికయ్యారు. బాలికల్లో హైదవీశ్రీ, కీర్తన, శ్రీలక్ష్మీప్రియ, మేఘన, వినమర, జునైర అన్మల్ ఎంపికయ్యారు. ఈ నెల 4, 5 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వారు పాల్గొనున్నారు.

